

ప్రపంచానికి 'సూపర్ డూపర్ ఎల్ నినో' ముప్పు..
ఎర్రగా మారిన భూగోళం!

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం

నిలువుటద్దం

విలేకరులు కావలెను...

సంచలన దినపత్రిక నిలువుటద్దం కు - తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వారీగా, మండలాల వారీగా పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9059548848

హైదరాబాద్. ఎడిటర్:- వై. రమ నాగరాజు సంపుటి:-32 సంచిక:-225 శుక్రవారం 09-10-2026

ప్లేగు ముప్పును కొట్టిపారేసిన రష్యా.. ఆందోళన అవసరం లేదన్న పుతిన్ ప్రభుత్వం

- సైబీరియాలో ల్యాబ్ ఉద్యోగి మృతితో ప్లేగుపై ఆందోళన
- ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేసిన రష్యా ఆరోగ్య శాఖ
- డబ్ల్యూహెచ్ఓకు సమాచారం ఇచ్చామని, పుకార్లను నమ్మవద్దని సూచన
- రష్యా మరింత పారదర్శకంగా ఉండాలన్న అమెరికా
- మృతురాలి కాంటాక్టులకు నెగెటివ్ అని తెలిపిన అధికారులు - మిగతా 2 లో

ఇంధన కేంద్రాలపై దాడులు ఆపాలని సూచన

- రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ 3-పాయింట్ ఫార్ములా.. అవేంటంటే?
- ధాన్యం, ఇంధన రవాణా కొనసాగించాలని హితవు
- వాణిజ్య నౌకలపై దాడులు ఆపాలని ప్రతిపాదన
- నల్ల సముద్రంలో వాణిజ్యానికి భద్రత కల్పించాలని సూచన
- 2024లో జైశంకర్ కీవ్ పర్యటనలో ప్రతిపాదన

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో ఏర్పడుతున్న నష్టాన్ని తగ్గించేందుకు భారత్ కీలక ప్రతిపాదన చేసింది. యుద్ధం వెంటనే పూర్తిగా - మిగతా 2 లో

పోరాటం ఆగదన్న రేవంత్ రెడ్డి

తనను అడ్డుకున్న ఢిల్లీ పోలీసులపై అసహనం

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇతర విపక్ష నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ఢిల్లీలో రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఘటనను తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి
- రాహుల్‌ను కలిసేందుకు యత్నించిన రేవంత్‌ను అడ్డుకున్న పోలీసులు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఈసీని అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని ఆరోపణ

యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్

2 లో..

- రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!
- బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ కట్టి ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని భట్టి ఆరోపణ
- గరిష్ఠ డిమాండ్ ఉన్నా రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని వెల్లడి
- జెన్‌కో, ట్రాన్స్‌కోల ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన డిప్యూటీ సీఎం

త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం

- బండి సంజయ్ నోట ఆసక్తికర మాటలు!
- బీజేపీ తనకు ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్న కేంద్ర మంత్రి
- ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని వ్యాఖ్య
- పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదని వెల్లడి
- కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి డ్రామాలని విమర్శ
- 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపణ

నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు వాటిని మెడల్స్ గా భావిస్తా

- తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్పందించిన రాహుల్ గాంధీ
- తనపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని వెల్లడి
- 'ఇండియా' కూటమి ఎంపీలతో ఖర్గే భోజన సమావేశం
- ఈసీపై పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం
- భేటీ అనంతరం జంతర్ మంతర్‌లో నిరసనకు విపక్షాలు సిద్ధం

నిన్న ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న

డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్

- ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కార్యాచరణ
- 'ఆపరేషన్ చైతన్యం', 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాల విస్తరణకు ఆదేశం
- డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్
- అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు
- గంజాయి రవాణాపై ఉక్కుపాదం, సరిహద్దుల్లో నిఘా పటిష్టం

ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత - మిగతా 2 లో

విష్ణువు చివరి అవతారమైన 'కల్కి'గా మోదీ కనిపిస్తున్నారు

భూటాన్ ప్రధాని ఆసక్తికర వ్యాఖ్యలు

- ప్రధాని మోదీపై భూటాన్ ప్రధాని పీఎం టోబ్గే ప్రశంసల వర్షం
- గ్లోబల్ సౌత్ గొంతుకను ప్రపంచ వేదికపై వినిపించడంలో మోదీ కీలక పాత్ర పోషించారని వ్యాఖ్య
- 2019లోనే మోదీని విష్ణువు అవతారంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసుకున్న టోబ్గే
- 'వికసిత్ భారత్' అంటే 'వికసిత్ భూటాన్' కూడా అని - మిగతా 2 లో

ఇరాన్‌తో పోరు.. అమెరికాకు ఆయుధ నష్టం రూ.31 వేల కోట్లు

- ఇరాన్‌తో సైనిక చర్యల్లో అమెరికాకు భారీ నష్టం
- ఫిబ్రవరి నుంచి 81 విమానాలు, డ్రోన్లు ధ్వంసం లేదా దెబ్బతిన్నాయని వెల్లడి
- పునరుద్ధరణ ఖర్చు రూ.31,000 కోట్లకు చేరవచ్చని అంచనా
- అత్యధికంగా 45 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు ధ్వంసం
- కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ నివేదికలో కీలక వివరాలు

ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా చేపట్టిన సైనిక చర్యల్లో ఆ దేశానికి భారీగా వైమానిక నష్టం వాటిల్లుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో ఇప్పటివరకు కనీసం 81 అమెరికా యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, మానవ రహిత డ్రోన్లు (యూఏవీ) ధ్వంసం కావడం లేదా దెబ్బతినడం జరిగిందని అమెరికా కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) తన తాజా నివేదికలో

ప్లేగు ముప్పును కొట్టిపారేసిన రష్యా.. ఆందోళన అవసరం లేదన్న పుతిన్ ప్రభుత్వం

తూర్పు సైబీరియాలోని ఇర్కుట్స్క్ రీజియన్‌లో ఓ ల్యాబొరేటరీ ఉద్యోగి మృతి చెందడంతో ప్లేగు మహమ్మారి వ్యాప్తి చెందుతుందనే ఆందోళనలపై రష్యా స్పందించింది. ఇది కేవలం ల్యాబ్‌కు పరిమితమైన ఒకేఒక్క ఘటన అని, ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేసింది. అయితే, ఈ విషయంలో మరింత పారదర్శకత అవసరమని అమెరికా కోరడంతో అంతర్జాతీయంగా ఈ ఘటనపై చర్చ మొదలైంది. రష్యా ఆరోగ్య పర్యవేక్షణ సంస్థ 'రోస్పోట్రెబ్నాడ్జోర్' ఈ వార్తలను తోసిపుచ్చింది. ఇర్కుట్స్క్ ప్రాంత ప్రజలకు ఎలాంటి అంటువ్యాధి ప్రమాదం లేదని బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. మరణించిన ఉద్యోగితో సన్నిహితంగా మెలిగిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించామని, ఎవరిలోనూ ఇన్‌ఫెక్షన్ లేదా ప్రమాదకరమైన వ్యాధికారక క్రిముల ఆనవాళ్లు కనిపించలేదని స్పష్టం చేసింది. ముందుజాగ్రత్త, నివారణ చర్యలు పూర్తిస్థాయిలో అమలు చేశామని, ఈ పరిస్థితిపై ప్రపంచ ఆరోగ్య సంస్థకు (ఔనూ) కూడా సమాచారం అందించామని పేర్కొంది. క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ కూడా ఈ విషయంపై స్పందించారు. నిబంధనల ప్రకారమే గత వారంలో డబ్ల్యూహెచ్‌ఓకు సమాచారం అందించామని ధృవీకరించారు. కొన్ని మీడియా సంస్థలు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఘటనపై మరింత పారదర్శకత కోరుతూ అమెరికా దౌత్యపరంగా ఫిర్యాదు చేసిందని తెలిపారు. అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని ఆయన సూచించారు. ఇర్కుట్స్క్‌లోని ఓ స్థానిక టీవీ ఛానల్ కథనం ప్రకారం, సదరు మహిళ అక్టోబర్ 2న షెలెఖోవ్ పట్టణంలోని ఆసుపత్రిలో మరణించారు. వెంటనే ఆసుపత్రిని క్వారంటైన్ చేసి, ఆమెతో సన్నిహితంగా ఉన్నవారిని పర్యవేక్షణలో ఉంచారు. మంగళవారం నాటికి వారిలో ఎవరికీ ప్లేగు లక్షణాలు బయటపడలేదని అధికారులు ప్రకటించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అథనోమ్ గాబ్రియేసస్ కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు. ఆ ప్రాంతంలో ప్లేగు కేసులేవీ నమోదు కాలేదని రష్యా అధికారులు తమకు నివేదించారని చెప్పారు. రష్యా వెలుపల ఈ వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం చాలా తక్కువగా ఉందని డబ్ల్యూహెచ్‌ఓ ముందుగానే అంచనా వేసింది. మృతురాలి అనారోగ్యాన్ని రష్యా అధికారులు సాధారణ "శ్వాసకోశ వైరల్ ఇన్‌ఫెక్షన్"గా అభివర్ణించారు. మరోవైపు, ఈ ఘటనపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న వివరాలు చాలా పరిమితంగా ఉన్నాయని, ఈ పరిస్థితి చిన్నదా లేక తీవ్రమైనదా అనేది అస్పష్టంగా ఉందని అన్నారు. రష్యా మరింత సమాచారం పంచుకోవాలని ఆయన కోరారు. ఈ ఘటన కోవిడ్-19 మూలాలపై జరిగిన చర్చలను గుర్తుచేస్తోంది. సాధారణంగా ఎలుకల ద్వారా వ్యాపించే బ్యుబోనిక్ ప్లేగుకు భిన్నంగా, శ్వాసకోశ కణాల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే న్యుమోనిక్ ప్లేగు అత్యంత ప్రమాదకరమైనది. ఈ నేపథ్యంలోనే అంతర్జాతీయంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

ఇంధన కేంద్రాలపై దాడులు ఆపాలని సూచన

ఆగకపోయినా.. దాని ప్రభావాన్ని తగ్గించేలా మూడు అంశాలతో కూడిన సంధి ప్రణాళికను సూచించింది. ఇంధన కేంద్రాలపై దాడులు ఆపడం, నల్ల సముద్రం ద్వారా ధాన్యం, ఇంధన రవాణాను కొనసాగించడం, వాణిజ్య నౌకలపై దాడులు నిలిపివేయడం ఇందులో ఉన్నాయి. భారత్ ప్రతిపాదించిన తొలి అంశం ఇంధన కేంద్రాలు, ఇతర కీలక మౌలిక వసతులపై దాడులు నిలిపివేయడం. విద్యుత్, ఇంధన వ్యవస్థలు దెబ్బతినకుండా చూడటం ద్వారా ప్రజల రోజువారీ జీవితం, ఆర్థిక కార్యకలాపాలపై యుద్ధ ప్రభావాన్ని తగ్గించవచ్చని భారత్ భావిస్తోంది. రెండో అంశం నల్ల సముద్రం రేవుల నుంచి ధాన్యం, ఇంధనం, సరకుల రవాణా కొనసాగించడం. యుద్ధం కారణంగా కీలక సరఫరా మార్గాలు దెబ్బతినకుండా చూడాలని భారత్ సూచించింది. ఆహారం, ఇంధన సరఫరాలో అంతరాయం రాకుండా ఇది ఉపయోగపడుతుందని భావిస్తోంది. మూడో అంశం వాణిజ్య నౌకల భద్రత. నల్ల సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడులు పూర్తిగా ఆపాలని భారత్ ప్రతిపాదించింది. ఇప్పటివరకు జరిగిన చర్చల్లో ధాన్యం రవాణాకు ఎక్కువ ప్రాధాన్యం ఉండగా.. భారత్ మాత్రం అన్ని వాణిజ్య నౌకలకు భద్రత కల్పించే అంశాన్ని ముందుకు తెచ్చింది. ఇదే భారత ప్రతిపాదనను ప్రత్యేకంగా నిలబెడుతోంది. గతంలో వచ్చిన కొన్ని ప్రతిపాదనలు ధాన్యం రవాణాపైనే దృష్టి పెట్టాయి. అమెరికా ప్రతిపాదన ప్రధానంగా ఇంధన కేంద్రాలపై దాడులు ఆపే అంశానికి పరిమితమైంది. భారత్ మాత్రం ఇంధన వసతులు, సరకుల రవాణా, వాణిజ్య నౌకల భద్రతను ఒకే ప్రణాళికలో చేర్చింది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ 2024 సెప్టెంబరు 3న కీవ్ పర్యటన సందర్భంగా ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చినట్లు సమాచారం. రష్యా-ఉక్రెయిన్ వివాదానికి చర్చలు, దౌత్య మార్గమే పరిష్కారమని భారత్ మొదటి నుంచి చెబుతోంది. యుద్ధం పూర్తిగా ముగిసే వరకు కనీసం కీలక రంగాల్లో దాడులను తగ్గించడం ద్వారా నష్టాన్ని నియంత్రించాలన్నది ఈ ప్రతిపాదన ఉద్దేశం.

పోరాటం ఆగదన్న రేవంత్ రెడ్డి.. తనను అడ్డుకున్న ఢిల్లీ పోలీసులపై అసహనం

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీని నిర్బంధించిన అనంతరం, ఆయనను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, వారిని పోలీసులు లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో పోలీసుల తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ వర్గాల ఓటు హక్కును లక్ష్యంగా చేసుకుని వివక్షా పూరితంగా వ్యవహరిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. "గతంలో ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధి పొందిన వారు, ఇప్పుడు ఏకంగా ఎన్నికల కమిషన్‌నే పావుగా వాడుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. అక్రమ అరెస్టులు, పోలీసుల నిర్బంధాలకు విపక్షాలు భయపడవని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు లింకేజీ ఇస్తామని హామీ ఇచ్చి యాదాద్రి ప్లాంట్‌ను ప్రారంభించిందని, కానీ ప్లాంట్‌కు అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని భట్టి గుర్తుచేశారు. సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నులు, మిగిలింది దిగుమతి చేసుకుంటామని ఒప్పందాలు చేసుకున్నా, బీఆర్ఎస్ హయాంలో వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్‌ను నిర్మించారా లేదా అనే దానిపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసి మూడు యూనిట్లను ప్రారంభించిందని భట్టి వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలను ప్రైవేటీకరిస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు విద్యుత్ అంశంపై రాద్ధాంతం చేస్తున్నాయని, తమ ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్

మొదటిపేజీ తరువాయి - రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. డ్రగ్స్ నిర్మూలనపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను డ్రగ్స్ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 'ఈగల్ క్లబ్'లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 'ఆపరేషన్ చైతన్యం', విద్యాసంస్థల సమీపంలో 'సేఫ్ క్యాంపస్ జోన్', యువత కోసం 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాల్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నివారణపై ఇతర రాష్ట్రాలతో సమన్వయం కోసం త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించాలని, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణలో పంజాబ్ పోలీసుల అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ఒడిశా నుంచి గంజాయి రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేశామని, డ్రోన్ల వినియోగాన్ని కూడా పెంచుతామని తెలిపారు. సమాజంలో చైతన్యం తెచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.

ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు గుర్తించామని, ఆయా రాష్ట్రాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేశామని, విజయవాడ, రాజమండ్రి నగరాల్లోని బ్లేడ్ బ్యాచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 శిక్షణ పొందిన జాగిలాలను వినియోగిస్తున్నామని, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 192 మంది పాత నేరస్థులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు.. వాటిని మెడల్స్ గా భావిస్తా

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తన లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసుకున్నా తానేమీ వెనుకంజ వేయబోనని, ఆ కేసులను మెడల్స్ గా భావిస్తానని అన్నారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నేడు జన్‌పథ్‌లోని సాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీల భోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, 'ఓట్ల దొంగతనం' అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ.. 'ఇది లంచ్ మాత్రమే కాదు, ఒక లాంచ్ కూడా కావచ్చు' అని చమత్కరించారు. కాగా, మంవారం 'ఓట్ల దొంగతనం' జరిగిందంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు 8 గంటల పాటు బైఠాయించారు. అనుమతి లేకుండా భవనంలోకి ప్రవేశించినందుకు పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌పై స్పందిస్తూ రాహుల్ గాంధీ, "నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100" అని తేలికగా వ్యాఖ్యానించారు. భోజన భేటీ అనంతరం, ఎంపీలందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లో బయలుదేరారు. మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పోలీసులు జంతర్ మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లే మార్గాల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

విష్ణువు చివరి అవతారమైన 'కల్కి'గా మోదీ కనిపిస్తున్నారు

మొదటిపేజీ తరువాయి - భారత ప్రధాని నరేంద్ర మోదీపై భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే ప్రశంసల వర్షం కురిపించారు. మోదీని తనకు అన్నయ్యగా భావిస్తానని, ఆయనను విష్ణువు అవతారంగా కూడా చూస్తానని చెప్పారు. మోదీ 25 ఏళ్లుగా ప్రభుత్వ అధినేతగా కొనసాగుతూ ప్రజా సేవ చేస్తున్న తీరును కొనియాడారు. మోదీ నాయకత్వంలో పొరుగు దేశాలతో సంబంధాలకు భారత్ ప్రాధాన్యం ఇస్తోందని టోబ్గే పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకను ప్రపంచ వేదికపై బలంగా వినిపించడంలో మోదీ కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో శాశ్వత సభ్యుడిగా చేర్చడంలోనూ ఆయన కృషిని ప్రశంసించారు. మోదీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న టోబ్గే.. ఆయనను చాలాకాలంగా అన్నయ్యగా భావిస్తున్నానని తెలిపారు. తర్వాత ఆయనను మార్గదర్శకుడిగా కూడా చూసినట్లు చెప్పారు. 2019లో మోదీని విష్ణువు అవతారంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 2024లో ఢిల్లీలో మోదీని కలిసినప్పుడు తాను గతంలో చెప్పిన మాటల గురించి ఆలోచించానని, తాను తప్పుగా చెప్పలేదని తేల్చుకున్నానన్నారు. విష్ణువు చివరి అవతారమైన కల్కిగా మోదీ కనిపిస్తున్నారని టోబ్గే అన్నారు. అశాంతిని తొలగించి ధర్మాన్ని పునరుద్ధరించి కొత్త మార్పుకు నాంది పలికే అవతారమే కల్కి అని పేర్కొన్నారు 'వికసిత్ భారత్' అంటే 'వికసిత్ భూటాన్' కూడా అని టోబ్గే వ్యాఖ్యానించారు. 2014లో ప్రధాని అయిన కొద్ది వారాల్లోనే మోదీ తన తొలి విదేశీ పర్యటనకు భూటాన్‌ను ఎంచుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ పర్యటనలో భారత్-భూటాన్

సంబంధాలను 'బీ4బీ'గా మోదీ అభివర్ణించారని తెలిపారు. అంటే 'భూటాన్ కోసం భారత్.. భారత్ కోసం భూటాన్' అని వివరించారు. భూటాన్ అభివృద్ధి ప్రణాళికలకు భారత్ అందిస్తున్న సహకారాన్ని టోబ్గే ప్రశంసించారు. 13వ పంచవర్ష ప్రణాళిక కోసం భారత్ అందించే సాయాన్ని మోదీ ప్రభుత్వం రూ.10 వేల కోట్లకు పెంచిందని చెప్పారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు, జల విద్యుత్, సాంకేతికత, వ్యవసాయం, వ్యాపార రంగాల్లో ఇరు దేశాల సహకారం విస్తరించిందన్నారు. భూటాన్ రాజు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గెలెఫు మైండ్‌ఫుల్‌నెస్ సిటీ ప్రాజెక్టుకు భారత్ పూర్తి మద్దతు ఇస్తోందని తెలిపారు. రైలు మార్గాలు, సరిహద్దు మౌలిక వసతులు, విమాన, డిజిటల్ కనెక్టివిటీ అభివృద్ధి దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ఇరాన్‌తో పోరు.. అమెరికాకు ఆయుధ నష్టం రూ.31 వేల కోట్లు

వెల్లడించింది. ధ్వంసమైన ఈ పరికరాల స్థానంలో కొత్తవి సమకూర్చుకోవడానికి అయ్యే ఖర్చు 3.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 31,000 కోట్లు) వరకు ఉండొచ్చని అంచనా. అక్టోబర్ 5న విడుదల చేసిన ఈ తాజా నివేదిక.. అమెరికా సైనిక ప్రకటనలు, మీడియా కథనాలు, రక్షణ శాఖ నివేదికల ఆధారంగా రూపొందింది. మే నెలలో విడుదల చేసిన నివేదికలో ఈ సంఖ్య 42గా ఉండగా, తాజా నివేదికలో ఇది 81కి చేరడం గమనార్హం. మే తర్వాత జరిగిన నష్టాలతో పాటు గతంలో లెక్కలోకి రాని ఘటనలను కూడా చేర్చడం వల్లే ఈ సంఖ్య పెరిగినట్లు నివేదిక స్పష్టం చేసింది. దెబ్బతిన్న కొన్ని విమానాలు మరమ్మతుల అనంతరం తిరిగి విధుల్లో చేరాయని కూడా పేర్కొంది. సైనిక కార్యకలాపాలు ఇంకా కొనసాగుతుండటంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం

మొదటిపేజీ తరువాయి - కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు త్వరలో తెలంగాణ బీజేపీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే ప్రచారం జరుగుతున్న వేళ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని, కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పడం అంతా డ్రామానేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపించారు. 1946లో కాంగ్రెస్ పీసీసీలన్నీ సర్దార్ పటేల్ ప్రధాని కావాలని ప్రతిపాదించినా.. నెహ్రూను ప్రధాని చేశారని విమర్శించారు. దేశంలో బోగస్ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్సే చెప్పిందని, ఇప్పుడు వాటిని తొలగిస్తుంటే ఎందుకు అభ్యంతరం చెబుతోందని ప్రశ్నించారు. ప్రధాని మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కుటుంబం, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు

ఆయనకు అవసరం లేదని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు చెప్పే మాటలు నమ్మి యువత మోసపోవద్దని బండి సంజయ్ సూచించారు. 2014కు ముందు, ఇప్పటి భారత్‌ను పోల్చి చూడాలని కోరారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదన్నారు. రాజ్యాంగ సంస్థను బదనాం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ఎన్నికల సంఘాన్ని కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని రాహుల్ గాంధీకి సూచించారు. వందల మందితో వెళ్లి దాడి చేస్తే పోలీసులు అడ్డుకోక ఏం చేస్తారని ప్రశ్నించారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమన్నారు. తెలంగాణలో అక్రమ చొరబాటుదారుల ఓట్లపై కూడా బండి సంజయ్ ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోనే 30 వేలకు పైగా రోహింగ్యాల ఓట్లు ఉన్నాయని అన్నారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు

రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష.. కీలక ఆదేశాలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా ఆరా తీశారు. రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

నిష్పక్షపాత నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం

శుక్రవారం 09-10-2026

నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

పెండింగ్ పనులు పూర్తి చేయాలి.

రైతుల కరెంట్ సమస్య పరిష్కరించాలి.

తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలి

కలెక్టర్ ను కోరిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి, అక్టోబర్ 08 నిలువుటద్దం ప్రతినిధి: శసంగారెడ్డి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ దృష్టికి తీసుకెళ్లారు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్. గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పట్టణాలు ,వివిధ మండలాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల అవసరాలపై కలెక్టర్‌తో విస్తృతంగా చర్చించారు.

రైతుల కరెంట్ సమస్యపై ప్రత్యేకంగా ప్రస్తావన

నియోజకవర్గంలో రైతులు విద్యుత్ కోతల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కనీసం 8 గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందకపోవడంతో సాగు పనులకు ఆటంకం కలుగుతోందని తెలిపారు. రైతులకు అవసరమైన విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా సంబంధిత విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు.

తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

నియోజకవర్గంలోని పలు గ్రామాలు, ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉన్న నేపథ్యంలో పరిశ్రమలకు నీటి సరఫరా కంటే ప్రజల తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. తాగునీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని కూడా వివరించారు.

అంబేద్కర్ భవనాల మంజూరుకు విజ్ఞప్తి

నియోజకవర్గంలోని అవసరమైన ప్రాంతాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన భవనాలను మంజూరు చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కలెక్టర్‌ను కోరారు. సామాజిక వర్గాల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అత్యవసర గ్రామాలకు బోర్‌వెల్స్ మంజూరు

తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న అత్యవసర గ్రామాల్లో బోర్‌వెల్స్ మంజూరు చేయాలని గతభేటీలో ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అత్యవసర గ్రామాల్లో రూ.21.50 లక్షల వ్యయంతో బోర్‌వెల్స్ మంజూరు చేసినట్లు తెలిపారు. దీంతో తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న గ్రామాలకు కొంతమేర ఉపశమనం లభించనుంది. సంగారెడ్డి నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను కూడా ఎమ్మెల్యే కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ భేటీలో ధనపు కలెక్టర్ పాండు ,మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సంగారెడ్డి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ప్రతి గ్రామపంచాయతీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి . అదనపు కలెక్టర్ ఆర్. పాండు.

సంగారెడ్డి నిలువుటద్దం ప్రతినిధి : సంగారెడ్డి జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఆర్. పాండు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖ, ఎన్‌సీసీ, మై భారత్ వాలంటీర్లు, ఎంపీడీవోలు, సర్పంచ్‌లు తదితరులతో టీబీ ముక్త్ భారత్ అభియాన్, జోష్ ఉన్నతస్థాయి జిల్లా కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ ఆర్. పాండు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం, పరీక్షలు నిర్వహించడం, సత్వర చికిత్స అందించడం వంటి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో టీబీ లక్షణాలు, పరీక్షలు, చికిత్స, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. టీబీ నిర్మూలన కార్యక్రమాల్లో యువతను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ సందర్భముగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె. లలితాదేవి, మాట్లాడుతూ ... నేషనల్ ట్యూబర్క్యులోసిస్ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ కింద జిల్లాలో టీబీ వ్యాధి ముందస్తు గుర్తింపు, సత్వర చికిత్స, నివారణ, కమ్యూనిటీ భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. 2026 సెప్టెంబర్ వరకు జిల్లాలో 1,750 టీబీ కేసులు నమోదయ్యాయని, బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 7 ఫంక్షనల్ ఎక్స్‌రే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని, 2026 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు నిర్దేశిత లక్ష్యంలో 109 శాతం ఎక్స్‌రే వినియోగం సాధించినట్లు ఆమె వెల్లడించారు. టీబీ బాధితులకు నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం అందించడంతో పాటు పోషకాహార సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద జిల్లాలో క్షయ వ్యాధి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న 144 గ్రామాలను గుర్తించి, నిక్షయ్ శివిర్ క్యాంపుల ద్వారా వల్నరబుల్ జనాభాకు టీబీ స్క్రీనింగ్ నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కమ్యూనిటీ భాగస్వామ్యం, అవుట్‌రీచ్, క్షేత్రస్థాయి కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు బ్లాక్ స్థాయిలో ఎంపీడీవోల నేతృత్వంలో మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లతో జోష్ (జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ టీబీ ముక్త్ భారత్ టీమ్స్) బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామపంచాయతీలను టీబీ రహిత పంచాయతీలుగా ప్రకటించేందుకు నిర్దేశించిన ప్రమాణాల ఆధారంగా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ , సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లాలో గుర్తించిన 41 టీబీ రహిత గ్రామాలకు సంబంధించిన సర్టిఫికెట్లను అదనపు కలెక్టర్ ఆర్. పాండు ఎంపీడీవోలు, సర్పంచ్‌లకు అందజేశారు. అలాగే మై భారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ విద్యార్థులకు కూడా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టీబీ ముక్త్ భారత్ ప్రతిజ్ఞ నిర్వహించారు. క్షయ వ్యాధి రహిత భారతదేశ నిర్మాణంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత భాగస్వాములై సమష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టి బి ప్రోగ్రాం అధికారిణి సి హెచ్ అరుణా కుమారి , జెడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీరాజ్ అధికారి, జిల్లా యువజన అధికారి, ఎన్‌సీసీ యూనిట్ కమాండర్, ఎంపీడీవోలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జనం కోసం జర్నలిజం పనిచేయాలి

రాజకీయ నేతల మడుగులు ఒత్తే జర్నలిజం సమాజానికి నిరుపయోగం

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలి

టి జే యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి

సంగారెడ్డి, అక్టోబర్ 8 నిలువుటద్దం ప్రతినిధి: ప్రజల సంక్షేమం, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం జర్నలిజం పనిచేయాలని, రాజకీయ నాయకుల మడుగులు ఒత్తే జర్నలిజం సమాజానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చదని తెలంగాణ జర్నలిస్టుల యూనియన్ (టిజే యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి అన్నారు. గురువారం జిన్నారంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ నూతన మండల కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని టి జే యూ జిల్లా అధ్యక్షులు ఎం. గిరి, ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బింగి స్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వాల మనుగడలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, అయితే ఎన్నికల సమయంలో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి జర్నలిస్టు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అర్హులైన జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు, జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన జర్నలిజం అవినీతి, అక్రమాలకు అండగా నిలవకూడదని అన్నారు. ఏ పూటకు ఆ గొడుగు పట్టే విధానాలకు, రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించే సంఘాల ఒత్తిళ్లకు జర్నలిస్టులు దూరంగా ఉండాలని సూచించారు. టి జే యూ జిల్లా అధ్యక్షులు ఎం. గిరి మాట్లాడుతూ.. ఒకప్పుడు జర్నలిస్టు వృత్తికి సమాజంలో ప్రత్యేక గౌరవం ఉండేదని, ప్రస్తుతం యూట్యూబ్, సోషల్ మీడియా విస్తరణతో జర్నలిజం విలువలు దెబ్బతింటున్నాయని అన్నారు. 1951లో ఏర్పడిన తొలి జర్నలిస్టు సంఘంగా టి జేయూ ప్రస్తావన ఉందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు కల్పించిన అధికారాన్ని రాజకీయ నాయకులు తమ స్వప్రయోజనాలకు వినియోగించకుండా ప్రజా ప్రయోజనాలకు పనిచేయాలని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో నాలుగో స్తంభంగా భావించే మీడియా స్వతంత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి జర్నలిస్టుపై ఉందని పేర్కొన్నారు. జనం కోసం జర్నలిజం పనిచేయాలి.. అవినీతి, అక్రమాలకు కాదు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే ధైర్యం కోల్పోయి, రాజకీయ నాయకుల మెప్పు కోసం పనిచేసే జర్నలిజం ప్రజలకు న్యాయం చేయలేదని గిరి పేర్కొన్నారు. అనంతరం పటాన్‌చెరు--జిన్నారం మండల టి జే యూ అధ్యక్షుడిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, సభ్యులుగా శేఖర్, పాషాలను నియమించారు. ఈ కార్యక్రమంలో టి జే యూ ఉమ్మడి జిల్లా నాయకులు ఎల్లన్న, సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పోచ గౌడ్, గజ్వేల్ టి జే యూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కన్నప్రేమ కరువైంది.. బాలానగర్‌లో నవజాత శిశువు రోడ్డుపాలు..!

కని పెంచాల్సిన పేగు బంధమే తెగిపోయిందో.. లేక వెంటాడిన కఠిన పరిస్థితులే లొంగదీసుకున్నాయో గానీ, అప్పుడే కన్నుతెరిచిన నవజాత మగ శిశువును రోడ్డుపై పడేసిన అమానుష ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపింది.

స్థానికుల అప్రమత్తత.. పునర్జన్మ పొందిన పసికందు

బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బాలానగర్ వైన్స్ సమీపంలో ఓ కందువాలో చుట్టి ఉన్న పసికందు రోదిస్తూ ఆ దారిన వెళ్తున్న కొందరు స్థానిక యువకులకు కనిపించింది. నిశ్శబ్ద వాతావరణంలో చిన్నారి ఏడుపు విని దగ్గరకు వెళ్లిన ఆ యువకులు, దృశ్యాన్ని చూసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వేళపాళ లేని వేళ, ఏమాత్రం కాలయాపన చేయకుండా వెంటనే బాలానగర్ పోలీసులకు సమాచారం అందించారు.

సకాలంలో వైద్యం.. ప్రాణాపాయం తప్పిన చిన్నారి

సమాచారం అందుకున్న వెంటనే బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, డీఐ సక్రమ్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన అధికారులు, శిశువును తక్షణమే బాలానగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చిన్నారికి అత్యవసర చికిత్స అందించి, నిరంతర పరిశీలనలో ఉంచారు. సకాలంలో ఆసుపత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పిందని, ప్రస్తుతం పాప ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందో లేదో వైద్యులు పర్యవేక్షిస్తున్నారు.

రంగంలోకి పోలీసులు.. సీసీటీవీల పరిశీలన

పోలీసుల సహకారంతో వైద్యులు శిశువుని అమీర్పేట్ లోని శిశు విహార కు తరలించారు. ఈ దారుణ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. బాలానగర్ ప్రధాన రహదారిలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. శిశువును వదిలివెళ్లిన కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నవారు ఎవరు, ఈ నిర్దయ చర్యకు వెనుక ఉన్న కారణాలేమిటనే కోణంలో విచారణ జరుపుతున్నారు. పసికందును రోడ్డుపాలు చేసిన బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ నరేష్ రెడ్డి స్పష్టం చేశారు.

అక్టోబర్ 14న కల్లుగీత కార్మికుల రాష్ట్ర సదస్సు

సదస్సును జయప్రదం చేయాలి: ఆశన్న గౌడ్

సంగారెడ్డి, అక్టోబర్ 08 నిలువుటద్దం ప్రతినిధి: కల్లుగీత కార్మిక సంఘం 69వ వార్షికోత్సవాల సందర్భంగా ఈ నెల 14న హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్ తెలిపారు. వృత్తిలో ఆధునీకరణ, గీత కార్మికుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై సదస్సులో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశం అనంతరం 69వ వార్షికోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో 50 ఏళ్లు నిండిన 37,381 మంది, సంగారెడ్డి జిల్లాలో 585 మంది కొత్తగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఎలాంటి షరతులు లేకుండా వారందరికీ పెన్షన్ మంజూరు చేయాలని, వృత్తి నిర్వహించే గీత కార్మికులకు కంఠమయ్య రక్షణ కవచాలు అందించాలని కోరారు. గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు, వృత్తిలో ఆధునీకరణ పద్ధతులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీలకు చెట్ల పెంపకం కోసం ఐదు ఎకరాల భూమి కేటాయించాలని, నందనంలోని నీరా, తాటి, ఈత ఉత్పత్తుల ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని కోరారు. పెన్షన్‌ను రూ.4 వేలకు, ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో సొసైటీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సదస్సుకు సొసైటీ అధ్యక్షులు, టీఎఫ్‌టీ బాధ్యులు, గౌడలు, గీత కార్మికులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆశన్న గౌడ్ పిలుపునిచ్చారు. సమావేశంలో జంగన్న గౌడ్, అంజా గౌడ్, ప్రసాద్ గౌడ్, వెంకటేశం గౌడ్, రామ గౌడ్, యాద గౌడ్, రవి గౌడ్, కృష్ణా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో

జహీరాబాద్, నిలువుటద్దం: ఎస్ఐఆర్ ప్రక్రియపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ జహీరాబాద్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డిల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జహీరాబాద్ రహదారి పై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు.ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మాజీ వైస్ ఎంపీపీ రాములు,,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర మాజీ కార్యదర్శి మల్లికార్జున్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌రెడ్డి, రవీందర్ చౌహన్, నరేష్, బబ్లూ, అసెంబ్లీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, ధర్మ నాయక్, మండల అధ్యక్షులు కిరణ్‌కుమార్ గౌడ్, రాఘవేందర్, సీడీసీ డైరెక్టర్ మల్లారెడ్డితో పాటు రాజు నాయక్, సంతోష్‌రెడ్డి,జహీర్ అరబ్బీ,రాంచంద్రారెడ్డి,అక్షయ్ జాడే, నవీద్, కుమ్మరి రాజు, రఘుపతి, లక్ష్మీకాంత్‌రెడ్డి, అక్తర్ గోరి, ఇమామ్ పటేల్, నర్సింహారెడ్డి, సోమప్ప, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బట్లూనిబాయి కుంటను కాపాడిన హైడ్రా

--- 1.09 ఎకరాల చెరువు చుట్టూ హైడ్రా ఫెన్సింగ్

రంగారెడ్డి బ్యూరో, నిలువుటద్దం: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం కుంట్లూరు గ్రామ పరిధిలో ఉన్న 1.09 ఎకరాల బంట్లూనిబాయి కుంటను హైడ్రా గురువారం కాపాడింది. సర్వే నంబరు 24లో దాదాపు 89 ఎకరాల వరకూ ప్రభుత్వ భూమి ఉండగా.. అందులోనే ఈ కుంట ఉంది. ఈ కుంట చుట్టూ ఇప్పటికే ఆక్రమణలు జరిగిపోయాయి. ఇళ్ల నిర్మాణాలు అయ్యాయి. ఇందులో కొన్ని ఇళ్లకు బీఆర్ ఎస్, కొన్ని ఇంటి స్థలాలకు ఎల్ ఆర్ ఎస్ వచ్చాయి. ఇంకా కొన్నిటికి ఎల్ ఆర్ ఎస్ రావాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో 1.09 ఎకరాల చెరువును కూడా కబ్జా చేసేయాలనే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. మట్టి పోసి నింపి చదును చేయడం.. ప్లాట్లుగా మార్చడం జరుగుతోందంటూ స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా.. క్షేత్రస్థాయిలో హైడ్రా అధికారులు పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిపోసి చదును చేసినట్టు నిర్ధారణ కావడంతో చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. అలాగే చెరువుగా నిర్ధారిస్తూ హైడ్రా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసింది.

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పోరుబాట

S.I.R. అక్రమాలపై నిరసనగా చలో లోక్ భవన్

హైదరాబాద్, నిలువుటద్దం ప్రతినిధి అక్టోబర్ 8: ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో లోక్ భవన్ (రాజ్ భవన్) కార్యక్రమంలో ౖూజజ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ పాల్గొన్నారు. **INDIA** కూటమి ఇచ్చిన **Save Democracy** పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణకు సంబంధించిన అంశాలపై నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ా.×.=. పేరుతో జరుగుతున్న ఓట్ల సవరణ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోందని, ఈ అంశంపై కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓటు హక్కును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని, ప్రజల ఓటు హక్కు పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి చలో లోక్ భవన్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బ్లాక్, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, సేవాదళ్, మహిళా కాంగ్రెస్, చీూఖ×తో పాటు అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలకు బండి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పాల్గొని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆపరేషన్ దుర్గం చెరువు

సైకో ఇచ్చిన వన్ మినిట్ టాస్క్‌ను సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ చేశాడు ఇన్‌స్పెక్టర్ రుద్ర.ఇంతలో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి మీద ఓ పిల్లాడు వేలాడుతున్నట్టు రుద్రకు సమాచారం వచ్చింది. దీంతో టీమ్‌తో అక్కడికి ప్రయాణమయ్యాడు. దారిలో వెళ్తున్న రుద్రకు 'ఆ పిల్లాడిని మామూలుగా వదిలేస్తే కిక్ ఏముంది చెప్పు??' అన్న సైకో మాటలే మెదడులో గిర్రున తిరుగుతున్నాయ్. అంటే, నెక్ట్స్ విడిచిపెట్టే పిల్లాడిని అంత ఈజీగా సైకో వదిలిపెట్టడని అర్థమైపోయింది. పది నిమిషాల్లో దుర్గం చెరువు వచ్చింది. కేబుల్ బ్రిడ్జి మీదనుంచి ఓ పెద్ద సంచిలో ఓ పిల్లాడిని ఎవరో వేలాడదీశారు. అయితే, సంచిలో ఎలాంటి కదలికలూ కనిపించలేదు. బ్రిడ్జి మీదనుంచి వేలాడుతున్న పిల్లాడిని ఎందుకు పైకి లాగలేదని రుద్ర అక్కడ ఉన్న సిబ్బందిని గద్దించాడు. దీంతో సంచికి కట్టిన తాడు మొదట్లో ఓ లెటర్ అతికించి ఉందన్న విషయాన్ని రుద్రకు చెప్పారు అక్కడి కానిస్టేబుల్స్. బ్రిడ్జ్ మీదికి ఏ వాహనాలూ రాకుండా ట్రాఫిక్‌ను మళ్లించి ఆ లెటర్ చదవడం ప్రారంభించాడు.

'హలో రుద్రా.. పిల్లల్లో ఒకడిని ఈ సంచిలో పెట్టి వేలాడదీసింది నేనే. సీసీటీవీ ఫుటేజీ వగైరా అంటూ టైమ్ వేస్ట్ చేసుకోకుండా నేను ఇచ్చే రెండు పజిల్స్‌ను నిమిషంలో సాల్వ్ చెయ్యి. ఒకవేళ జవాబు తప్పుగా చెప్పినా లేక, ఇన్‌టైమ్‌లో ఆన్సర్ చేయలేకపోయినా.. పిల్లాడికి కట్టిన తాడు దానంతట అదే ఊడిపోతుంది. పిల్లాడు అంతెత్తు నుంచి నీటిలో పడిపోతాడు. పాపం.. మత్తులో ఉన్నాడు కదా.. ఈత కొట్టే అవకాశం కూడా ఉండదు. మరో విషయం.. నీ పోలీసు బుద్ధితో ఇప్పుడే పిల్లాడిని విడిపించుకోవాలని చూస్తావేమో! ఆ ప్రయత్నం చేస్తే.. అబ్బాయే కాదు.. మొత్తం బ్రిడ్జి పేలిపోతుంది. మరి ఈ 'ఆపరేషన్ దుర్గం చెరువు'ను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేస్తావా?' అంటూ లెటర్ ముగించాడు సైకో. ఇంతలో ఆకాశం నుంచి ఓ డ్రోన్ ద్వారా ఓ లెటర్ రుద్ర ముందు పడింది. దాన్ని తెరిచి చదవడం ప్రారంభించాడు రుద్ర. 'మిస్టర్ రుద్రా.. ఇప్పుడు టైమ్ రాత్రి 10.20 గంటలు. 10.30 గంటల నుంచి 10.31 గంటల వరకూ అంటే ఒక్క నిమిషంలో నేను అడిగే పజిల్‌కు నువ్వు ఆన్సర్ చేయాలి. క్వశ్చన్లు సరిగ్గా 10.30 గంటలకు ఈ డ్రోన్ నుంచి ఓ లెటర్ రూపంలో కింద పడతాయి. నువ్వు ఆన్సర్స్‌ను డ్రోన్‌లోని వాయిస్ రికార్డర్‌కు వినిపించేంత గట్టిగా ఒక్క నిమిషంలో చెప్పాలి. సమాధానం కరెక్ట్ అయితే.. పిల్లాడు, బ్రిడ్జి రెండూ సేఫ్.. లేదంటే.. పిల్లాడు, బ్రిడ్జ్ రెండూ ఫినిష్! వెయిట్ ఫర్ మై క్వశ్చన్స్' అని రాసి ఉంది. దీంతో రుద్ర హార్ట్‌బీట్ మరింతగా పెరిగింది. సమయం.. రాత్రి 10.30 గంటలు. డ్రోన్ నుంచి ఓ లెటర్ కిందపడింది. అందులో ఇలా ఉంది.. 'రుద్రా.. మొదటి ప్రశ్న.. సునందకు నలుగురు కూతుళ్లు. ప్రతీ కూతురికి ఒక బ్రదర్ ఉన్నాడు. ఇప్పుడు సునందకు ఎంతమంది పిల్లలు ఉన్నారో.. సంచిలో ఉన్న ఈ అబ్బాయి ఇంట్లో కూడా అంతమంది ఉంటారు. ఈ అబ్బాయి ఎవరి కొడుకు? రెండో ప్రశ్న.. కుడి చెయ్యి చేసే ప్రతీ పనిని.. ఎడమ చెయ్యి కూడా చేయగలదు. అయితే ఒక్కపని తప్ప. అదేంటో గట్టిగా అరిచి చెప్పు' అని ఉంది. ప్రశ్నలు చదవడానికే అర నిమిషం పూర్తయింది. దీంతో అప్రమత్తమైన రుద్ర.. ఐదుగురి పిల్లల పేరెంట్స్‌ను వెంటనే పిలిచి.. ఎవరింట్లో ఎంతమంది ఉంటారో అడిగాడు. మొదటి వ్యక్తి 8, రెండో వ్యక్తి 9, మూడోవ్యక్తి 5, నాలుగో వ్యక్తి 6, ఐదో వ్యక్తి ఏడుగురు అని సమాధానం చెప్పారు. దీంతో సంచిలో ఉన్న పిల్లాడు ఎవరి కొడుకో రుద్ర గట్టిగా అరిచి చెప్పాడు. ఇంకో పది సెకండ్ల టైమ్ మాత్రమే మిగిలి ఉంది. కుడి చెయ్యి–ఎడమ చెయ్యి పజిల్‌కు ఆన్సర్ ఏంటో రుద్రకు స్ఫురించట్లేదు. ఏమైతుందోనని అంతా ఒకటే టెన్షన్. ఇంతలో ఏదైతే అదైందని తాను అప్పటికప్పుడు అనుకొన్న ఆన్సర్‌ను గట్టిగా అరిచి చెప్పాడు రుద్ర. అయితే, గాలి గట్టిగా వీయడంతో వాయిస్ రికార్డర్‌కు ఆ శబ్దం వినబడలేదు. దీంతో మరో మూడు సెకండ్లు ఉందనగా.. రుద్ర మళ్లీ గట్టిగా అరిచి రెండో పజిల్ ఆన్సర్ చెప్పాడు. టైమ్ పూర్తయ్యింది. తాను చెప్పిన ఆన్సర్లు కరెక్ట్.. అవునా? కాదా? అని రుద్రతో పాటు అందరూ టెన్షన్‌తో ఎదురు చూస్తున్నారు.

రెండు నిమిషాల తర్వాత మరో డ్రోన్ అక్కడికి వచ్చి ఓ లెటర్‌ను కిందకు విసిరేసింది. 'బ్రిలియంట్ రుద్ర. నా రెండు పజిల్స్‌కు నువ్వు కరెక్ట్‌గా ఆన్సర్ చేశావ్. సో.. ఆపరేషన్ దుర్గం చెరువు సక్సెస్. ఇక ఈ పిల్లాడిని నువ్వు తీసుకెళ్లొచ్చు. అయితే, ఈ పిల్లాడిని నువ్వు వాళ్ల ఇంటికి తీసుకెళ్తావా? లేక శ్మశానానికా? మరిన్ని వివరాల కోసం.. నీ మొబైల్‌లో మెసేజ్ చూడు' అని ఆ లెటర్‌లో ఉంది. అది చదవగానే రుద్ర కాళ్లకింద భూకంపం వచ్చినంత పనైంది. అంతలోనే ఓ ఇంటర్నెట్ స్పామ్ నంబర్ నుంచి అప్పుడే రుద్ర ఫోన్‌కు మెసేజీ డెలివరీ అయ్యింది. కంగారుగా ఓపెన్ చేశాడు రుద్ర 'హాయ్ రుద్రా.. టెన్షన్ అంటే ఏంటో మొదటిసారి చూస్తున్నావా? ఇది జస్ట్ ఫస్ట్ రౌండ్ మాత్రమే. అసలు ఆట ముందు ఉంది. ఈ పిల్లాడికి నేను ఓ ఇంజెక్షన్ ఇచ్చా. అయితే, ఎలాంటి విషాన్ని, మందును, కనీసం నీళ్లను కూడా నేను ఆ బాబు ఒంట్లోకి ఎక్కించలేదు. అయినప్పటికీ కొద్దిసేపట్లో అతను చనిపోతాడు. అసలేం జరిగిందో టెస్టులు చేసి డాక్టర్లు తెలుసుకొనే లోపే పిల్లాడి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. అందుకే, ఈ బాబును డైరెక్టుగా శ్మశానానికి తీసుకుపో.. లేదు. కాపాడతా అంటావా? అయితే, నా ఇన్ఫర్మేషన్‌లోనే ఆన్సర్ ఉంది. దమ్ముంటే కాపాడుకో' అని ఆ మెసేజీలో ఉంది. దీంతో కంగారు పడిపోయిన రుద్ర.. హుటాహుటిన పిల్లాడిని హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. టెస్టులకు సమయం పడితే, పిల్లాడి ప్రాణాలకే ప్రమాదం అని గ్రహించిన రుద్ర.. సైకో ఇచ్చిన ఇన్ఫర్మేషన్‌ను డీకోడ్ చేసి అసలు సమస్యేంటో డాక్టర్స్‌కు చెప్పాడు. దీంతో ఆ డైరెక్షన్‌లోనే టెస్టులు చేసిన వైద్యులు సమస్య అదే అని కనిపెట్టారు. సకాలంలో వైద్యం చేయడంతో పిల్లాడు ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. ఇంతకీ, సైకో అడిగిన రెండు పజిల్స్‌కు సమాధానమేంటి? పిల్లాడికి సైకో ఏ ఇంజెక్షన్ ఇచ్చినట్టు? దాన్ని రుద్ర ఎలా కనిపెట్టినట్టు??

సమాధానం: మొదటి పజిల్‌లో సునందకు నలుగురు కూతుళ్లు అని సైకో చెప్పాడు. ప్రతీ కూతురికి ఒక బ్రదర్ అని కూడా చెప్పాడు. అంటే ఈ లెక్కన సునందకు నలుగురు కూతుళ్లు, ఒక కొడుకు. అంటే సునందకు మొత్తం ఐదుగురు సంతానం. మూడో వ్యక్తి ఐదుగురు అన్నాడు. అంటే అతనే పిల్లాడి తండ్రి. ఇక, రెండో పజిల్‌లో కుడి చెయ్యి చేసే ప్రతీ పనిని.. ఎడమ చెయ్యి కూడా చేయగలదు. అయితే ఒక్కపని తప్ప అని సైకో అడిగాడు. ఎడమ చెయ్యి తన మోచేతిని తాకలేదు. అయితే, కుడి చెయ్యి ఎడమ చెయ్యి మోచేతిని తాకగలదు. ఇదే ఆన్సర్. దీన్ని రుద్ర కరెక్ట్‌గా చెప్పాడు. ఇక, ఎలాంటి విషాన్ని, మందును, కనీసం నీళ్లను కూడా లేని ఇంజెక్షన్‌ను పిల్లాడికి ఇచ్చానని సైకో చెప్పాడు. అంటే పిల్లాడికి సైకో ఎయిర్ ఎంబ్లాయిజమ్ (రక్త నాళాల్లోకి గాలిని ఎక్కించడం) చేశాడని రుద్ర కనిపెట్టాడు. డాక్టర్లకు ఆ విషయాన్ని చెప్పడంతో సకాలంలో చికిత్స అంది పిల్లాడు బతికి బయటపడ్డాడు.

బంజారాలకు పదవేది?

ఇరవై ఏండ్ల పోరాట ఫలితంగా బంజారాలకు 1976లో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు దక్కాయి. నాటి నుంచి కాంగ్రెస్ పాలనలో మంత్రిమండలికి బంజారా జాతి ప్రాతినిధ్యం వహించింది తొమ్మిదేండ్ల ఐదు నెలలు మాత్రమే. టీడీపీ పదిహేడు ఏండ్ల పాలనలో 1989లో ఎన్టీ రామారావు మంత్రివర్గంలో అజ్మీరా చందులాల్‌కు మంత్రిగా అవకాశం దక్కింది. ఆ తర్వాత 1995–2004 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఏనాడూ బంజారా జాతికి తన మంత్రిమండలిలో అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు ఆయన దారిలోనే తన శిష్యుడు రేవంత్‌రెడ్డి కూడా నడుస్తుండటం గమనార్హం. తెలంగాణలో సుమారు ఏడు శాతం జనాభా ఉన్న బంజారాలకు మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం లేని సందర్భాలు రెండే రెండు. ఒకటి, చంద్రబాబు హయాంలో, రెండు ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో. బంజారా ఓట్లను వాడుకొని అధికారం చేపట్టిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు బంజారాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. తన మంత్రిమండలిలో బంజారాలకు అవకాశం ఇవ్వకపోవడమే అందుకు నిదర్శనం. పద్నాలుగేండ్ల పాటు తెలంగాణ ఉద్యమంలో బంజారా జాతి కేసీఆర్ వెన్నంటే నిలిచింది. ఆ తర్వాత కూడా పదేండ్ల పాటు గిరిజన బిడ్డలు గులాబీ జెండాకు అండగా నిలబడ్డారు. ఈ విషయాన్ని గ్రహించిన కేసీఆర్ రెండు పర్యాయాలు తన మంత్రివర్గంలో బంజారాలకు అవకాశం కల్పించారు. మొదటి పర్యాయం అజ్మీరా చందులాల్, బీఆర్ఎస్ రెండోసారి అధికారం చేపట్టాక సత్యవతి రాథోడ్ మంత్రులుగా బంజారా జాతికి ప్రాతినిధ్యం వహించారు. ఇద్దరు కలిసి ఏడేండ్ల 9 నెలల పాటు మంత్రులుగా సేవలందించారు.

బీఆర్ఎస్ పాలనలో బంజారాల అభ్యున్నతికి కేసీఆర్ ఎంతో కృషి చేశారు. ప్రభుత్వం తరఫున నిధులు కేటాయించి బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని నిర్వహించారు. బంజారాహిల్స్‌లో సేవాలాల్ పేరిట ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించారు. 'మా తండాలో మా రాజ్యం' కలను సాకారం చేస్తూ తండాలు, గూడేలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి స్వయం పాలనకు పునాది వేశారు. ఎస్టీ రిజర్వేషన్లను 10 శాతానికి పెంచారు. ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధిగా రిటైర్డ్ ఐఏఎస్ రామచంద్ర తేజావత్‌ను నియమించారు. గవర్నర్ కోటాలో రాములు నాయక్‌కు ఎమ్మెల్సీగా అవకాశమి చ్చారు. నాతోపాటు గాంధీ నాయక్, వాలియా నాయక్‌లకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశం కల్పించారు. టీఎస్‌పీఎస్సీ సభ్యులుగా డాక్టర్ చంద్రావతి రమావత్ ధన్‌సింగ్ నాయక్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులుగా రాంబల్ నాయక్, రాంబాబు నాయక్, సమాచార కమిషనర్‌గా గుగులోతు శంకర్ నాయక్‌లకు అవకాశం ఇచ్చి బంజారా జాతిని గౌరవించారు. అంతేకాదు, 70 ఏండ్ల స్వతంత్ర భారత్‌లో ఎన్నడూ వెలుగులకు నోచుకోని తండాల్లో 24 గంటల కరెంట్‌ను సరఫరా చేశారు. రాష్ట్రంలోని 58 నియోజకవర్గాల్లో బంజారా ఆత్మగౌరవ భవనాలను నిర్మించారు. గురుకుల పాఠశాలలు, కళాశాలలు నిర్మించి గిరిజన జాతి ఉన్నతికి తోడ్పడ్డారు. నాలుగు లక్షల ఎకరాల పోడు పట్టాలు పంచిపెట్టిన కేసీఆర్‌ను బంజారా జాతి ఎప్పటికీ మర్చిపోదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మాయమాటలను నమ్మి, ఆరు గ్యారెంటీలకు ఆకర్షితులై అందరిలాగానే గిరిజన జాతి కూడా మోసపోయింది. రేవంత్ ప్రభుత్వం ఏర్పడటంలో 30–45 నియోజకవర్గాల్లోని గిరిజనుల ఓట్లు కీలకపాత్ర పోషించాయి. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం నేడు తన మంత్రిమండలిలో బంజారాల గళం లేకుండా చేశారు. కేసీఆర్ సర్కారు అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేసి, గిరిజనులను నమ్మించి మోసం చేశారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్‌ను బొందపెట్టేందుకు యావత్ బంజారా జాతి సిద్ధంగా ఉన్నది.

నోటి క్యాన్సర్ హెచ్చరికలు



ప్రపంచవ్యాప్తంగా నోటి క్యాన్సర్ కేసుల సంఖ్య పెరుగుతున్నది. నోరు, పెదవులు, నాలుక, గొంతు భాగాల్లో నోటి క్యాన్సర్ ప్రభావం చూపుతుంది. ఏటా వేలాది మంది ఉసురు తీస్తున్నది. తొలి దశలో వ్యాధిని గుర్తించడమే చికిత్సకు, రోగి త్వరగా కోలుకోవడానికి కీలకంగా నిలుస్తుంది. లక్షణాలు గుర్తించకపోతే క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యమైపోతుంది. కాబట్టి, నోటి క్యాన్సర్ ముప్పు తగ్గించుకోవడానికి కొన్ని హెచ్చరికలు కనిపిస్తాయి. వాటినినిర్లక్ష్యం చేయకూడదు.

నోట్లో పుండ్లు : నోట్లో ఏర్పడిన పుండ్లు రెండు వారాల్లోగా తగ్గకపోతే అనుమానించాల్సిందే. అయితే, కొన్నిసార్లు పుండ్లు త్వరగా తగ్గిపోయినప్పటికీ, క్యాన్సర్ మాత్రం అలాగే ఉండిపోతుంది. ఈ పుండ్లు పెదవులు, చిగుళ్లు, బుగ్గల లోపలి భాగంలో కనిపిస్తాయి. వీటినుంచి రక్తం కారొచ్చు. లేదంటే ఇబ్బందికరంగా అనిపించవచ్చు. దంత వైద్యుణ్ని కలిసి పరీక్ష చేయించుకోవడం వ్యాధిని తొలిదశలో గుర్తించడానికి వీలు కనిపిస్తుంది.

మొద్దుబారడం, నొప్పి : నోట్లో ఎడతెగకుండా నొప్పి, మొద్దుబారినట్టు ఉండటం, నోరు, గొంతు, పెదవుల భాగాల్లో మంటగా అనిపించడం నోటి క్యాన్సర్‌కు సంకేతం కావొచ్చు. వీటిని సాధారణంగా దంత సమస్యలుగానో, నరాల సమస్యలుగానో పొరబడుతుంటారు.

మింగడంలో ఇబ్బంది : మింగడం, నమలడం, నాలుక, దవడ కదపడంలో ఇబ్బందిగా ఉంటే తేలిగ్గా తీసుకోకూడదు. ఇది నోటి క్యాన్సర్ తొలిదశ సంకేతం కావొచ్చు. గొంతులో గడ్డలా అనిపిస్తుంది. దీంతో ఆహారం లోపలికి వెళ్లడం ఇబ్బందిగా ఉంటుంది. యాసిడ్ రిఫ్లక్స్, ఇతర ఇన్ఫెక్షన్ల వల్ల కూడా ఇలా జరుగుతుంది. కానీ, ఎక్కువ రోజులు సమస్య కొనసాగితే నిర్లక్ష్యం చేయకూడదు.

నోటి దుర్వాసన : నోటి దుర్వాసనను చాలామంది మామూలు విషయంగా భావిస్తారు. అయితే, ఇది ఎక్కువ కాలంపాటు కొనసాగితే జాగ్రత్త వహించాలి. నోటి దుర్వాసన నోటి క్యాన్సర్‌కు తొలిదశ సంకేతం కూడా అవ్వొచ్చు.

గడ్డలు, వాపులు : నోరు, మెడ, దవడల్లో గడ్డలు, మందపాటి ప్యాచెస్, వాపు లాంటివాటిని అంతగా పట్టించుకోరు. తెలుపు, ఎరుపు ప్యాచ్‌ల రూపంలో నోటి క్యాన్సర్ లక్షణాలు బయల్పడతాయి. గడ్డల రూపంలోనూ ఉంటాయి. కాబట్టి, క్రమం తప్పకుండా నిపుణులను సంప్రదిస్తే నోటి క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించవచ్చు.

తగ్గించుకోవడం ఎలా : ఒక లక్ష మందిలో 11 మందికి వారి జీవితకాలంలో నోటి క్యాన్సర్ అభివృద్ధి చెందే ముప్పు ఉంటుంది. పురుషుల్లో ఈ రిస్క్ ఎక్కువ. దీనికి కొన్ని కారణాలు ఉన్నాయి.

ధూమపానం: పొగాకు ఏ రూపంలో తీసుకున్నా నోటి క్యాన్సర్ రావొచ్చు. కాబట్టి, పొగతాగడం, జర్దాలాంటివి తినడం పూర్తిగా మానేయాలి.

మద్యపానం: నోటి క్యాన్సర్ సహా అన్ని రకాల క్యాన్సర్లు ఆల్కహాల్ సేవనం ద్వారా వస్తాయి. కాబట్టి పరిమితికి మించిన మద్యపానం మంచిది కాదు.

పెదవులకు సన్‌బ్లాక్: సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల (యూవీ రేస్) బారినుంచి కాపాడుకునేందుకు పెదవులకు సన్‌బ్లాక్ అప్లయి చేయడం ద్వారా నోటి క్యాన్సర్ ముప్పు తగ్గించుకోవచ్చు.

హెచ్‌పీవీ నుంచి రక్షణ: హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) కూడా నోటి క్యాన్సర్‌కు ఓ కారణం. టీకాలు, ఇతర జాగ్రత్తల ద్వారా హెచ్‌పీవీ బారినపడకుండా చూసుకోవాలి.

ఆరోగ్యమే మహాభాగ్యం : క్రమం తప్పకుండా దంతాల పరీక్ష చేయించుకోవాలి. దంత వైద్యులు నోటి క్యాన్సర్ తొలిదశ సంకేతాలను గుర్తించగలుగుతారు. తొలిదశలో గుర్తించడమే చికిత్సలో కీలకం. కాబట్టి, లక్షణాలను గమనించిన వెంటనే వైద్య సహాయం పొందాలి. తరచుగా స్క్రీనింగ్ చేయించుకోవాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలి. నోటి ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవాలి. పండ్లు, కూరగాయలను భోజనంలో చేర్చుకోవాలి.

ఆధునాతన పంట విధానాలతో అధిక దిగుబడులు : వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఆధునాతన పంట విధానాలతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రియా, సుధీర్, శ్రీకృష్ణ, దిలీప్ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రధానంగా రైతులలో అభివృద్ధి చెందిన వ్యవసాయ సాంకేతికత, స్థిరమైన వ్యవసాయ విధానాల ద్వారా దిగుబడిని, ఆదాయాన్ని పెంచవచ్చని వివరించారు. అధిక దిగుబడి, అధిక లాభం కలిగించే తోటల సాంకేతికతలు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతికత ప్రయోగాలపై రైతులకు వివరించారు. వ్యవసాయం, వనరుల సమర్థ వినియోగం, పంట ఆరోగ్యంపై నిఘా, ఆటోమేటెడ్ నీటి పారుదల వ్యవస్థలు, మెరుగైన వ్యవసాయ విధానాల గురించి నిపుణులు వివరించారు. ఇందులో ముఖ్యంగా రైతుల పొలాల నుంచి మట్టి నమునాలను శాస్త్రీయంగా సేకరించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, ఏఈవో గీత, ఉద్యానవన శాఖ అధికారి కీర్తికృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పాలకూర జ్యూస్‌ను తాగుతున్నారా..? అయితే ఈ జాగ్రత్తలను పాటించాల్సిందే..!

పాలకూర మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటుంది. పాలకూరతో చేసే వంటలను అందరూ ఎంతో ఇష్టంగా తింటారు. దీంతో అనేక కూరలు, ఇతర వంటకాలను చేయవచ్చు. ఆరోగ్యంగా ఉండాలంటే పాలకూరను తరచూ తినాలని పోషకాహార నిపుణులు కూడా చెబుతుంటారు. పాలకూరలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. దీన్ని పోషకాలకు నెలవుగా అభివర్ణిస్తుంటారు. పాలకూరను రోజూ తినడం కన్నా జ్యూస్ చేసి తాగితే మేలు అని చాలా మంది బావిస్తుంటారు. ఉదయం పరగడుపునే దీని జ్యూస్‌ను తాగుతుంటారు కూడా. అయితే పాలకూర జ్యూస్‌ను రోజూ తాగే వారు కొన్ని జాగ్రత్తలను తప్పక పాటించాలని, లేకపోతే లాభం కలగకపోగా నష్టం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇక ఆ జాగ్రత్తలు ఏమిటంటే..

రోజుకు ఎంత తాగాలి..?

పాలకూర జ్యూస్‌ను రోజుకు 120 నుంచి 240 ఎంఎల్ మోతాదులోనే తాగాలని, అంతకు మించి తాగకూడదని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాలకూర జ్యూస్‌ను వారంలో 3 లేదా 4 సార్లు తాగితే చాలు, రోజూ తాగాల్సిన పనిలేదని వారు అంటున్నారు. కేవలం పాలకూర జ్యూస్‌ను మాత్రమే కాకుండా దాంతోపాటు ఇతర పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను తీసుకుంటే సమతుల ఆహారం లభిస్తుందని వారు అంటున్నారు. అయితే పాలకూర జ్యూస్‌ను ఎప్పుడూ ఒక పోషక పదార్థంగా భావించాలి తప్ప తినే ఆహారానికి బదులుగా కేవలం ఈ జ్యూస్‌ను మాత్రమే తాగి ఉండకూడదని అంటున్నారు. ఇతర ఆహారాలను కూడా తినాలని వారు సూచిస్తున్నారు.

విటమిన్ సి అందేలా..

పాలకూర జ్యూస్‌తోపాటు విటమిన్ సి లభించేలా చూసుకోవాలి. దీంతో పాలకూరలో ఉండే ఐరన్‌ను శరీరం ఎక్కువగా శోషించుకుంటుంది. అందుకు గాను పాలకూర జ్యూస్‌లో కొద్దిగా నిమ్మ లేదా నారింజ రసం కలిపి తాగాల్సి ఉంటుంది. దీంతో ఐరన్ సమృద్ధిగా లభించి రక్తం అధికంగా తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. ఎర్ర రక్త కణాలు ఆరోగ్యంగా ఉంటాయి. పాలకూర జ్యూస్‌ను నేరుగా తాగితే జీర్ణ వ్యవస్థపై భారం పడే అవకాశం ఉంటుంది. కనుక అందులో కొద్దిగా ఏదైనా ఇతర పండ్ల రసం లేదా నీరు కలిపి తాగితే మంచిది. పాలకూర జ్యూస్‌ను తాగడం కొత్తగా మొదలు పెట్టేవారు ముందు చిన్న మొత్తంలో తాగడం మంచిది. తరువాత ఎక్కువ పరిమాణం పెంచవచ్చు. లేదంటే జీర్ణ వ్యవస్థపై భారం పడే అవకాశం ఉంటుంది.

వీరు తాగకూడదు..

కిడ్నీ స్టోన్లు ఉన్నవారు లేదా మూత్రాశయం, కిడ్నీ సమస్యలు ఉన్నవారు పాలకూర జ్యూస్‌ను తాగకూడదు, పాలకూరను కూడా తినకూడదు. రక్తాన్ని పలుచగా చేసే మందులను వాడేవారు కూడా ఈ జ్యూస్‌ను తాగకూడదు. కొందరికి ఫుడ్ అలర్జీలు ఉంటాయి. అలాంటి వారు డాక్టర్ సూచన మేరకు పాలకూర జ్యూస్‌ను తాగాల్సి ఉంటుంది. పాలకూర జ్యూస్‌ను తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది, క్యాన్సర్ కణాల పెరుగుదల ఆగిపోతుంది. కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ జ్యూస్ ఎంతగానో మేలు చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు.

క్యాబేజీ మామిడికాయ పచ్చడి

కావలసిన పదార్థాలు

క్యాబేజీ తురుము: కప్పు
మామిడి తురుము: రెండు మూడు టేబుల్ స్పూన్లు
నూనె: మూడు టీస్పూన్లు
ఆవాలు: టీస్పూను
ధనియాలు: టీస్పూను
మెంతులు: అర టీస్పూను
ఎండు మిరపకాయలు: రెండు
ఇంగువ: చిటికెడు
పసుపు: చిటికెడు
కొత్తిమీర: నాలుగు రెబ్బలు
పచ్చిమిరపకాయలు: రెండు (ఇష్టాన్ని బట్టి)
ఉప్పు: తగినంత

తయారీ విధానం

కాస్త మీడియం సైజు క్యాబేజీ ముక్కను తీసుకుని ఒక కప్పు అయ్యేంత తురిమి పక్కకు పెట్టుకోవాలి. అలాగే పచ్చి మామిడి ముక్కను తీసుకుని రెండు మూడు స్పూన్ల తురుముగా చేసుకొని పక్కకు పెట్టాలి. పొయ్యి మీద బాణలి పెట్టి అందులో ఆవాలు, ధనియాలు, మెంతులు, ఎండు మిరపకాయలు వేసి వేగాక కాస్త ఇంగువ కూడా జోడించి దినుసులన్నిటినీ ఒక ప్లేట్‌లోకి తీసి ఆరబెట్టాలి. తర్వాత అదే నూనెలో ఇందాక పక్కన ఉంచిన క్యాబేజీ, మామిడి తురుమును వేసి, ఉప్పు, పసుపు కూడా జోడించి కాస్త మగ్గనిచ్చి పొయ్యి ఆపేయాలి. ఈ లోపు ఇందాక చేసి పెట్టుకున్న పోపుని మిక్సీలో వేసి కాస్త బరకగా పొడిబట్టి, ఈ తురుములో వేయాలి. కావాలనుకుంటే పచ్చిమిరపకాయ ముక్కలు కూడా కలిపి, చివర్లో తరిగిన కొత్తిమీరను చల్లుకుంటే ఎండకాలపు ప్రత్యేకమైన మామిడి, క్యాబేజీ పచ్చడిని పుల్లపుల్లగా లాగించేయొచ్చు!

Printed, Published and owned by Y. Ramadevi on behalf of NAGAPUBLICATIONS and printed of Koushik Printers, Vidya Nagar, Hyderabad
Published.... 3/5, MIG Flats, KPHB, Hyderabad 500072, Editor Y. Nagaraju, Ph. No. 9059548848 RNI:APTEL/2001/14027